# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## ఈ మాసపు సమాచారం అక్టోబర్ - నవంబర్ 2010

FOR PRIVATE CIRCULATION ONLY

## మీకు తెలుసా !

### ఊష్ణ ప్రాంతాలలో చెట్ల ఉపయోగం

ఊష్ణ మండల ప్రాంతాలలో వాతావరణాన్ని నియంత్రించడానికి, ప్రకృతి వలన నష్టాలు తగ్గించడానికి చెట్లు చాలా చక్కగా ఉపయోగపడుతాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. చెట్లు ఉన్న పరిసరాల్లో - భూమిమీద సేంద్రీయ పదార్థం ఎక్కువగా వుంటుంది. ఉదాహరణకు సర్కారు తుమ్మ కంప చెట్లు పెరిగిన ప్రాంతంలో గమనిస్తే బయట చెట్లులేని ప్రాంతంలో కంటే, చెట్లు ఉన్న ప్రాంతంలో భూమిమీద సేంద్రీయ పదార్థం ఎక్కువగా కనపడుతుంది. చెట్లు వున్న ప్రాంతంలో నేలమీద నత్రజని, పోషక పదార్థాలు ఎక్కువగా కనిపిస్తాయి. భూమిలోపల పొరల వరకూ పోషక పదార్థాలు ప్రయాణిస్తాయి. వర్షం నేరుగా భూమిపై వేగంగా పడకుండా వేగాన్ని నియంత్రించడంవల్ల, నేల పొర వర్షానికి కొట్టుకుని పోకుండా వుంటుంది. అనేక విధాలుగా క్రియలు, ప్రతి క్రియలు జరగడం మూలంగా నేల భౌతిక పరిస్థితి పరిపుష్టంగా మారుతుంది. ఎండలు ఎక్కువగా కాస్తున్న కాలంలో చెట్లు వున్న ప్రాంతాలలో వాతావరణ వేడి రెండు సెంటీగ్రేడుల వరకూ తక్కువగా వుంటుంది. అలాగే వర్షాకాలంలో 16 సెంటీగ్రేడ్‌ల వరకూ భూమి ఉపరితలం మీద ఉష్ణోగ్రత వుంటే, భూమిలోపల 5 సెంటీగ్రేడ్‌ల వరకూ ఉష్ణోగ్రతను నిలిపి వుంచుతుంది. ఎండకాలంలో ఉష్ణోగ్రతలను తగ్గించి, వర్షాకాలంలో ఉష్ణోగ్రతలను పెంచుతుంది. చెట్లు పెంచడంవల్ల ఆదాయాల్తోపాటు, ప్రకృతి నుంచి రక్షించడానికి ఉపయోగ పడుతాయి.

**(లీసా ఇండియా, మార్చి 2009 నుండి)**

### మునగ విత్తనాలు నీటిని శుద్ధి చేస్తాయి

మునగ కాయలు, ఆకులు వాడకానికి చాలా మంచివని మనకందరికీ తెలుసు. అయితే మునగ విత్తనాలు దాదాపు 98 శాతం నీటిని శుద్ధి చేస్తాయని శాస్త్రవేత్తలు కనుక్కున్నారు. మునగ విత్తనాలను మెత్తగా నూరి నీటిలో కలిపి కొంచెంసేపు అలాగే ఉండనిస్తే, అపరిశుభ్ర నీరు కిందికి చేరుకుంటుంది. ఆఫ్రికా దేశాలలో పురాతన కాలం నుంచి, నీటి శుద్ధి కొరకు మునగ విత్తనాలను వాడడం జరుగుతోందని చెబుతున్నారు.

**డౌన్ టు ఎర్త్ మే, 1-15/2010 సంచిక నుండి)**

**చిట్కా :** **అడ్డసరం మొక్క ఆకులను చిన్న ముక్కలుగా తురిమి నీళ్ళలో వేసి కషాయం కాచి చిన్న గ్లాసెడు రోజూ తాగుతూ వుంటే 40 రోజులలో ఉబ్బసం సమస్య తగ్గుతుంది.**

## వ్యవసాయంలో పరస్పర సహకారంతోనే బడుగు రైతులకు భవిష్యత్తు

ఈసారి బాగా దిగుబడులు వస్తాయనుకున్న ఖరీఫ్ వేరుశెనగ పంట అతివృష్టివలన రైతులకు దక్కకుండాపోయింది. ఎప్పుడూ వర్షాలు రాక అనావృష్టితో కరువుల వల్ల పంటలు రాకుండాపోతే ఈసారి వర్షాలు ఎక్కువై పంటలు రాకుండా పోయినాయి. ఒక రకంగా "పచ్చి కరువు" అని చెప్పవచ్చు. వెనుక వానలతో కాయలు కట్టె మొత్తం నష్టపోయినారు. అదును దాటిపోతుందని ఒక్కోసారి అరకొర పదునులో కూడా విత్తనం వేసే సందర్భాలున్నాయి. గింజమోసులు పోవడానికి తగినంత తేమలేనప్పుడు, విత్తనాల్ని చీమలు తినిపోయిన అనుభవాలు కూడా మనకున్నాయి. ఎద్దులున్న వారికి పనిముట్లు లేకపోవడం, పనిముట్లున్నవారికి పశువులు లేకపోవడం, సమయానికి కూలీలు దొరక్కపోవడం విత్తనం కొనడానికి, ఎరువులు కొనడానికి, కూలీలకు, ట్రాక్టర్లతో సేద్యం చేయించడానికి అప్పులు పుట్టకపోవడం లాంటివన్నీ ప్రతి సంవత్సరం మన జిల్లా రైతాంగాన్ని వేధిస్తున్న సమస్యలు. పంట పెట్టడంలోనూ, పంటలను కాపాడుకుని పంట ఇంటికి చేర్చే వరకూ అవుతున్న ఖర్చులు రైతుల శక్తికి మించి అవుతున్నాయి. అన్నీ సవ్యంగా జరిగి పంట చేతికి వచ్చిన సందర్భంలో కూడా రైతుకు మిగిలేది చాలా తక్కువగా వుంది. సంవత్సరమంతా రైతు ఈ ఒక్క పంటతోనే బతకాలి. ఎందుకిట్లా ఖర్చులు పెరిగిపోతున్నాయి ? మునుపు వస్తున్న ఆదాయం ఇపుడెందుకు రావడం లేదు ? వీటిని గూర్చి మనం ఆలోచించాలి. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే అష్టకష్టాలుపడి పంట పెట్టుకోవడం, పంటను ఇంటికి తీసుకురావడం మధ్యన కేవలం మూడు నాలుగు నెలల్లో రైతాంగం ఆలోచనలకు తీరిక లేకుండా ఉరుకు పరుగులతో పొలాలను గురించి పట్టించుకోవడం ఆ తరువాత దాదాపు 8 నెలల కాలం వ్యవసాయాన్ని గురించి, పంటల గురించి మర్చిపోవడం జరుగుతోంది. ఇది రైతుల తప్పుకాదు. మన జిల్లా వ్యవసాయ పరిస్థితులు అలాంటివి. స్థూలంగా చూస్తే రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు ఇవి అని చెప్పుకోవచ్చు. (1) పంటల మీద వాతావరణ మార్పుల ప్రభావం (2) హద్దులు లేకుండా పెరిగిపోతున్న పెట్టుబడులు (3) పంటలపై చీడపీడల ప్రభావాలు (4) పెరుగుతున్న కుటుంబ అవసరాలు (5) రైతుల అదుపులో లేని గిట్టుబాటు ధరలు. ఈ అయిదింటినీ కలిపి ఆలోచిస్తే, కొన్ని సమస్యలు కొంతవరకూ తగ్గించుకోగలవి వున్నాయి. కొన్ని మన చేతుల్లో లేవు. మనం పట్టుదలతో పూనుకుంటే కొంత వరకు వాటి ప్రభావం తగ్గించుకోగలం. మన చేతుల్లో లేని వాటిని వేరే సందర్భాలలో మాట్లాడుకుందాం. కానీ మన చేతుల్లో ఉండేదేమిటో వాటిని గురించి ప్రస్తుతం మాట్లాడుకుందాం.

### సస్యమిత్ర గ్రూపుల ముఖ్య ఉద్దేశ్యం పరస్పర సహకార విధానం పాటించడం

పట్టణాల్లో మాదిరి గ్రామాల్లో ఎవరికి వారు విడిగా జీవించడం సాధ్యం కాదు. ఎందుకంటే గ్రామల్లో ప్రధాన వృత్తి వ్యవసాయం. పంట భూములు కలిగిన వ్యవసాయదారులతో పాటు, గ్రామంలోని వ్యవసాయ కూలీలు, చేతి వృత్తులవారు కలిస్తే సాగేదే వ్యవసాయం. ఈ ప్రాధాన్యతను గుర్తెరిగే మహాత్మా గాంధీ పల్లెలు గ్రామ స్వరాజ్యాలుగా ఉండాలని, పరస్పర

→

సహకార వ్యవసాయ పద్ధతి అభివృద్ధి చెందాలని తపన పడ్డారు. కారణాలు ఏమిటి అన్న వాటి మీద మనం లోతుకెళ్ళి చర్చించడానికి సమయం లేదు కానీ, ఈ రోజు గ్రామాల్లోని రైతుల మధ్య పరస్పర సహకారం లేకుండా పోయింది. గ్రామల్లో సహకార ధోరణి, ఐక్యత లేకుండా పోయింది. దాని ఫలితంగా కూడా వ్యవసాయంలో అనేక దుష్ప్రభావాల్ని చూస్తున్నాము. సంక్షోభంలో వున్న వ్యవసాయాన్ని కొంత రక్షించుకొని, దారిద్ర్యం నుండి మెట్ట రైతులు, చిన్న రైతులు బయటపడాలంటే పరస్పర సహకార విధానం మన చేతుల్లో వున్న ఒక మంచి అవకాశం. ఈ సహకార విధానాన్ని రైతులలో పాటింపచేసి, సహకార స్ఫూర్తిని పెంపొందించడానికి గ్రామ స్థాయిలోనూ, మండల స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ సస్యమిత్ర గ్రూపులు ఏర్పాటు చేయడం జరిగింది. పై స్థాయిలో ఇంకా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## పరస్పర సహకార పద్ధతిని ఏ విధంగా పాటించాలి ?

ఇప్పుడే కాదు, రాబోయే రోజుల్లో కూడా వ్యవసాయ పనులకు మనుషులు దొరకడం కష్టం. పైగా వర్షాధార వ్యవసాయం. వర్షాన్ని బట్టి ఎప్పటి పనులు అపుడు జరగాల్సిందే. కాబట్టి ముందూ వెనుకలు లేకుండా ఒకేసారి పనులు పూర్తి చేయాల్సి వుంటుంది. గతంలో జొన్న, కొర్ర, వేరుశనగ, సద్ద, పత్తిలాంటి బహుళ పంటలు సమాన స్థాయిలో పండించేవారు. కొర్ర సద్దలాంటి పంటలు ముందుగా వచ్చేవి. పనులలో వైవిధ్యం ఉండేది. ఇప్పుడు గ్రామం మొత్తం మీ 4-5 రోజుల లోపల విత్తనం పూర్తి కావాలి. వారం రోజుల లోపల చెనక్కాయ పంట కల్లం చేరే పనులు పూర్తి కావాలి. పైగా ఇప్పుడు గ్రామాలలో వ్యవసాయ పనిముట్లు కూడా కొరతగా ఉన్నాయి. ఎద్దులు లేవు. నైపుణ్యం కలిగిన మనుషులు కూడా కొరతగా ఉన్నారు. ఈ పరిస్థితి అధిగమించడానికి మనం ఆలోచించాలి. గ్రామంలో ఉన్న రైతుల కుటుంబాలలోని వారందరూ వ్యవసాయ పనులు చేసుకునేవారే. కాకపోతే అదునులో పంటలు పెట్టడానికి, పంటలు వదుపు కోవడానికి కుటుంబంలోని సభ్యులు మాత్రమే సరిపోరు. అదనంగా ఇతరుల సహకారం అవసరమౌతుంది. ఒకరి పొలంలో ఒక కుటుంబం పని చేసుకోవడం కంటే, పది కుటుంబాలకు చెందిన వారు కలిసి పని చేస్తే ఫలితం ఎలా ఉంటుంది ? పని తొందరగా అయిపోతుంది. అదే పద్ధతిన మిగతావారి పొలాల్లో కూడా పనులు చక్కబెట్టుకోవచ్చు. దీని కోసం 25 కుటుంబాల రైతులు గ్రామంలో ఒక్కొక్క సస్యమిత్ర గ్రూపుగా ఏర్పడాలి. పరస్పరం వ్యవసాయ పనులు పూర్తి చేసుకోవాలి. ఒక్క గ్రూపులో 3 లేదా 4 లేదా 5 కుటుంబాలు కలిసి చిన్న చిన్న ఉప గ్రూపులుగా కూడా ఏర్పడవచ్చు. పని అవసరాన్ని బట్టి గ్రూపులో మందిని సమీకరించుకోవచ్చు. ఒకరి కోసం అందరు. అందరి కోసం ఒకరు అనే సహకార సిద్ధాంతాన్ని ఆచరించి అందరూ ప్రయోజనం పొందవచ్చు. చాలా మందికి ఒక విషయం తెలిసే ఉంటుంది. గ్రామంలో కట్టుకాలువ పూడిక తీయడానికి ఎకరాల లెక్కన మనుషులు పూడిక తీయడానికి పోవాలి. పోవడం కూడా ఒక సంప్రదాయంగా ఉంది. ఒక వేళ ఎవరైనా ఎగ్గొడితే కూలీ రేట్ల ప్రకారం డబ్బులు చెల్లించాలి. అదే విధంగా బదులు కూలి ఆ ప్రతిపాదిక మీదనే పనులు ఏర్పాటు చేసుకోవాలి. దీనివలన ఒత్తిడి ఉండదు. సాధ్యమైనంతవరకూ అదనపు మనుషుల అవసరం రాదు. ఒక వేళ వచ్చినా ఖర్చు తక్కువగా ఉంటుంది. తాము పొందే శ్రమకు, శ్రమ ద్వారానే బదులు తీరుస్తారు కాబట్టి ఖర్చు సమస్య రాదు.

ఇప్పటికీ సాంప్రదాయంగా రెండు, మూడు కుటుంబాలు ఒక గ్రూపుగా విత్తనం వేసుకునే అలవాటు ఉంది. దీనికి 10-15 కుటుంబాలకు విస్తరింపచేసి వ్యవసాయం పనులు, పంట ఉత్పత్తులు అమ్ముకోవడం, ఉమ్మడిగా ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, నూర్పిడి యంత్రాలు మొదలగు కావలసిన యంత్రాలు సేకరించుకోవడంలాంటి కార్యక్రమాలు సస్యమిత్ర గ్రూపులు చేపట్టవచ్చును. తద్వారా ఖర్చు ఆదా అవుతుంది. సరైన సమయంలో పనులు పూర్తవుతాయి.

సాధ్యమయినంత వరకూ పొలాలు దగ్గర దగ్గర ఉన్న రైతులు 25 మంది దాకా ఒక గ్రూపుగా ఏర్పడాలి. ఉమ్మడిగా మొత్తం సభ్యుల భూములకు ఎంత విత్తనం అవసరమయ్యేది, ఏ రకం విత్తనం అవసరమయ్యేది అంచనా వేసుకుని అవసరమనుకున్నప్పుడు బయటి నుండి సేకరిస్తారు. సాధారణంగా గ్రామంలో ఏ గ్రూపు సభ్యులు ఆ గ్రూపు రైతుల వద్దే విత్తనం నిలువ ఉంచుకుంటారు. వీరి మధ్యే విత్తనం ఇచ్చిపుచ్చుకుంటారు. గ్రామంలో మిగతా రైతుల నుంచి కూడా అవసరమైన సందర్భాలలో సేకరిస్తారు. యంత్రాల కొనుగోలు, నిర్వహణ ఖర్చులు ఎకరాల దామాషా మీద ఏ రైతుకు ఆ రైతు భరిస్తాడు. పనులు మనుషుల లెక్క బదుళ్ళ పద్ధతి మీద అందరూ కలిసి ఒకే పొలంలో పని చేసుకోవచ్చును. లేదా వారి అనుకూలత, పనుల స్వభావాన్నిబట్టి చిన్న ఉప గ్రూపులుగా విడిపోయి ఇద్దరు ముగ్గురి పొలాల్లో పనులు చేసుకోవచ్చును. మహిళా పొదుపు సంఘాలు ఏర్పాటు చేసుకున్న పద్ధతిలోనే సస్యమిత్ర గ్రూపులు కూడా పొదుపు ఏర్పాటు చేసుకొని, దాని నుండి అప్పులు కూడా సభ్యులు తీసుకోవచ్చును. గ్రూపు సంఘం పేరు మీదనే బ్యాంకుల్లో అప్పులు తీసుకోవడం, కట్టడం చేయవచ్చును. ఈ లావాదేవీలను గ్రూపుగా నియంత్రణ చేయాలి. పంటల భీమాను సమిష్టిగా సాధించగలగాలి. గ్రూపు పేరు మీదనే అమ్మకాలు, కొనుగోలులు లాంటివి సాగించాలి. ఉదాహరణకు వేరుశనగకు అదనపు విలువ రావడానికి ఉమ్మడిగా పప్పు చేసి అమ్మవచ్చును. ధర పలకకపోతే సరుకు విలువ ఉంచి బ్యాంకు నుంచి రుణం పొందవచ్చును. గ్రూపుకు కావలసిన ఎరువులు ఉమ్మడిగానే తయారు చేసుకోవచ్చును. పంట రోగ నివారణ కొరకు అవసరమైన కషాయాలు కూడా ఉమ్మడిగానే తయారు చేసుకోవచ్చును. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలైన పాడి, పశుసంపద, గొర్రెలు, మేకలు, కోళ్ళు తదితర వాటికి కూడా బ్యాంకు ఋణాలు తీసుకోవచ్చు. ఒక వేళ పంట పూత దశలో బెట్ట ఏర్పడితే ఒక ట్రాక్టరు మీదనో ఒక బండి మీదనో స్ప్రింక్లరు వేసుకుని వాడు పట్టేదశలో ఒక తడి ఇవ్వవచ్చును. దీని వలన పంట దిగుబడి 20-30 శాతం వరకూ రక్షించిన వారమవుతాము.

పైన చెప్పిన అనేక రకాలుగా పరస్పర సహకారంతో గ్రూపులోని సభ్యులు అందరూ ప్రయోజనం పొందే విధంగా అవసరమైన కట్టుబాట్లను, ఆచరణ పద్ధతులను గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలి. గ్రూపులలో నిర్ణయాలు అందరి అభిప్రాయాలు సేకరించి ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి. ఆర్థిక లావాదేవీలలో పూర్తి పారదర్శకత, నీతి, నిజాయితీ ఉండేటట్లు గ్రూపులు పని చేయాలి. ఈ విధంగా గ్రూపులు పని చేసినపుడు వ్యవసాయం కొంత వరకైన సులభతరమవుతుంది. ఖర్చు తగ్గుతుంది, ఆదాయం పెరుగుతుంది.

కాబట్టి, మీరందరూ సస్యమిత్ర గ్రూపులలో ఈ పరస్పర సహకారంపై చర్చించి, తగిన విధంగా నిర్ణయాలు తీసుకొని, ఆచరిస్తారని కోరుకొంటున్నాను.

మీ

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు.**

# వ్యవసాయం జీవనోపాధుల మీద వాతావరణ మార్పులు కలుగజేస్తున్న దుష్ఫలితాలపై దక్షిణ భారతస్థాయి బహిరంగ విచారణ

డిశెంబరు, 2010 మాసంలో మెక్సికోలోని కాన్‌కన్‌లో జరిగే 16వ వాతావరణ మార్పుల సదస్సులో భారత దేశ ప్రజాభిప్రాయాన్ని సేకరించడానికి దక్షిణ భారత దేశ స్థాయిలో 22-10-2010న అనంతపురం క్రిష్ణకళా మందిర్‌లో ఒక ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఎకాలజీ సెంటరు, టింబక్ట్ కలెక్టివ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ విచారణ కార్యక్రమానికి జస్టిస్ లక్ష్మణరావుగారు (మాజీ అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి) అధ్యక్షత వహించారు. విచారణ కమిటి సభ్యులుగా ప్రముఖ సామాజికవేత్త రుక్మిణిరావుగారు (హైదరాబాద్), డా॥ ఓం ప్రకాష్ రూపేలాగారు (వ్యవసాయ శాస్త్రవేత్త), డా॥ రామక్రిష్ణారెడ్డిగారు (SKU ప్రొఫెసర్), శ్రీ యం.ఎల్.నరసింహారెడ్డిగారు (పత్రికా రంగం) సభ్యులుగా వ్యవహరించారు.

జ్యోతి ప్రజ్వలన గావించిన తర్వాత ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డిగారు ప్రజాభిప్రాయ సేకరణ సదస్సుకు ఆహ్వానం పలుకుతూ వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా వాతావరణం వేడిలో, చలిలో మార్పులు వచ్చినాయన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వ్యవసాయం, పాడిపరిశ్రమ, చేపలు పట్టడంలాంటి వృత్తులమీద తీవ్రప్రభావాన్ని చూపుతున్నాయని చెప్పారు. నిజానికి మనలాంటి దేశాల ప్రజలు భూతాపం పెరగడానికి ప్రధాన కారణం కాకపోయినా. అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న పారిశ్రామీకరణ విధానాలమూలంగా మనమందరం వాతావరణ విపరీత ప్రభావాలకు లోనవుతున్నామని చెప్పారు. ఈ దుష్టపరిమాణాలలో మార్పులు తీసుకురావడానికి మనం మన గళం వినిపించాలి. దక్షిణ భారతదేశం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావులు తమ వాంగ్మూలాల్ని విచారణ కమిటీ ముందు నమోదు చేస్తారు. ఈ విషయాలమీద ఏ విధమైన చర్యలు తీసుకోవనే అంశంమీద న్యాయవిచారణ కమిటీ సూచనలు చేస్తుంది. ఇక్కడెవరూ నిందితులు లేరు, ఈ న్యాయ విచారణ కమిటీ ఇచ్చే నివేదికను భారత ప్రభుత్వానికి, అంతర్జాతీయ సంస్థలకు పంపించడం జరుగుతుందన్నారు.

మొదటగా రాప్తాడు మండలానికి చెందిన మహిళా రైతు ఉషగారు వాంగ్మూలమిస్తూ వాతావరణ మార్పుల ప్రభావంవలన వర్షాలు సక్రమంగా కురవకపోవడం చేత రైతుల పాడి పశువులను పెంచుకోవడం మానివేశాము. పశువులను మేపడానికి పచ్చిక బయళ్ళు కూడా లేకపోవడంచేత పశువులను మార్కెట్టులో అమ్ముకోవడం జరుగుతోంది. దీనితో రాబోవు కాలంలో పశుసంతతే ఉండదేమోనన్న అనుమానం కలుగుతోందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలవారు ప్రపంచ వాతావరణాన్ని నాశనం చేస్తున్నందులకు మా నిరసన గళాలను అంతర్జాతీయ సదస్సులో వినిపించాల్సిందిగా కోరారు.

ఆదివాసీ ఐక్యవేదిక కుంజం పండుదొర (తూర్పు గోదావరి జిల్లా) గారు వాంగ్మూలమిస్తూ, అడవులంటే పచ్చగా మంచి వాతావరణముంటుందని అందరూ భావిస్తారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అనేక రకాల స్థానిక విత్తనాలు, పాల పిట్టల జాతి పక్షులు అదృశ్యమయినాయి. మేం తిండి పంటలు పండించుకోవాడానికి వీలులేకుండా వ్యాపార పంటలు వచ్చినాయి. స్థానిక పంటల రకాలు కనుమరుగు కావడంతో కరువులు వస్తున్నాయి. ఆకలి చావులు వస్తున్నాయి. పరిశ్రమల పేరుతో మా భూముల్ని మాకు కాకుండా చేస్తున్నారు.

ఈ రోజు మా భూములు మాకు కావాలి. మా పంటలు మాకు కావాలని అడుగుతున్నాము అని అన్నారు. మీ సమస్యల మీద వాతావరణం మార్పుల ప్రభావమేమిటి ? అని న్యాయమూర్తి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ, ఎండలు అధికం కావడంమూలాన ఇప్పపూలు రావడంలేదు. సీజనులో అవి పూయడం లేదు. మా జీవితాల్లో ఇప్పపూలు ఎంతో ప్రధానమైనవన్నారు.

మెదక్ జిల్లాకు చెందిన మహిళారైతు సమ్మక్క వాంగ్మూలమిస్తూ, వాతావరణంలో మార్పులు వచ్చిన కారణంగా అనేక రకాల స్థానిక పంటలు, మొక్కలు, పక్షులు ఇపుడు కనపడడం లేదు. పక్షులు లేకపోవడంవలన పంటలమీద పురుగులు ఎక్కువయినాయి. మునుపు మేము పండించే జొన్నలలోనే యాభైరకాలుండేవి. ఒక్కొక్క రకం జొన్న ఒక్కొక్క మందుగా మాకు ఉపయోగపడేది. మనతోపాటు అన్ని రకాల జంతువులను మొక్కలను బతికించుకోవాలన్నారు.

శ్రీ జి. శ్రీనాథ్, కుంటిమద్ది గ్రామ రైతు వాంగ్మూలమిస్తూ వాతావరణ మార్పుల తీవ్రతను తగ్గించుకునే విధంగా సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఆచరించాలని అందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పించాలని వాంగ్మూలమిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిరోధించాలని, దిబ్బలలో ప్లాస్టిక్ పేపర్లు ఉంటుండడం మూలంగా అవి తిరిగి పొలాల్లో పడి పంటలకు హాని చేస్తున్నాయన్నారు.

శ్రీమతి లింగమ్మ, మల్లాపురం గ్రామ రైతు వాంగ్మూలమిస్తూ జిల్లాలో చెరువులు, కుంటలు నిండకపోవడంవలన దాదాపు 10వేల కటుంబాలు చేపలు లేక జీవనోపాధి దెబ్బతినిందని అన్నారు.

కర్నాటక రాష్ట్రానికి చెందిన చెన్నకేశవగారు ఆదివాసీలకు ఆహార భద్రత గురించి వాంగ్మూలమిచ్చారు. బెంగళూరుకు చెందిన బి.వి. జోషిగారు, డా॥ ప్రసూనగారు గ్రామీణుల ఆరోగ్యాలపై వాతావరణ మార్పుల ప్రభావం గురించి వాంగ్మూలమిచ్చారు. శ్రీనాథ్‌రెడ్డి, హెచ్. నారాయణప్ప, ఆదిలాబాద్ జిల్లా నుండి శివప్రసాద్, బక్కారెడ్డి, షర్మిలా, క్రిష్ణారెడ్డి, రాజశేఖర్, వెంకటనర్సప్ప, రవీంద్ర, హెచ్. ఓబిలేసు, నీలమ్మ, అటవీ శాఖ నిపుణులు లక్ష్మీకాంతం తదితతరులు కమిటీ ముందు ఆయా అంశాలమీద వాంగ్మూలాలు ఇచ్చారు.

జ్యూరీ సభ్యుల తరఫున జస్టిస్ లక్ష్మణరావుగారు విచారణ కార్యక్రమాన్ని సమాప్తం చేస్తూ ఇచ్చిన వాంగ్మూలాలలోని అంశాల్ని, వాటి ప్రాధాన్యతల్ని వివరించారు. ఈ నివేదికను సంబంధిత సంస్థలకు, ప్రభుత్వాలకు అందిస్తామన్నారు. మిగతా జ్యూరీ సభ్యులు కూడా వారికి కలిగిన అభిప్రాయాల్ని ప్రకటించారు. ఎకాలజీ డైరెక్టరు మల్లారెడ్డిగారు వందన సమర్పణగావిస్తూ, కార్యక్రమాన్ని ముగించారు.

# సుస్థిర వ్యవసాయ పద్ధతులలో...

## పెరటి తోటలతో ప్రయోజనం పొందుతున్న ఓబుళమ్మ కుటుంబం

కూడేరు మండలం ముద్దలాపురం గ్రామానికి చెందిన దళిత కుటుంబం శ్రీమతి ఓబుళమ్మ, ఏసయ్యలు, ఎకాలజీ సెంటరు అందించిన పెరటి తోటల కాయగూర విత్తనాలతో కుటుంబానికి కావలసిన కాయగూరలు పండించుకుంటున్నారు.

శ్రీమతి ఓబుళమ్మ, ఏసయ్యలకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆర్.డి.టి. సంస్థ కట్టించిన ఇంట్లో సుఖంగా కాపుర ముంటున్నారు. ఇంటి ముందు ఖాళీ స్థలం నిరుపయోగంగా ఉండేది. ప్రతి కుటుంబానికి పౌష్టికాహారం వసతి కలగాలనే లక్ష్యంతో ఎకాలజీ సెంటరు పనిచేస్తున్న గ్రామాలలో కాయగూరవిత్తనాలను సరఫరా చేసి, పెరటి తోటలపెంపకాన్ని ప్రోత్సహించింది. సంస్థ అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్నారు ఓబుళమ్మ, ఏసయ్య దంపతులు. విత్తనాలు నాటటానికి భూమిని బాగా చదును చేసి, గుల్లబార్చి విత్తనాలు నాటారు. చుట్టూ కంచె కూడా వేసుకున్నారు. దీనికి భార్యాభర్తలిరువురూ రెండు రోజులు శ్రమపడ్డారు. ఇంటికి కొంత దూరంలో పబ్లిక్ కొళాయి, ఒక హ్యాండ్ పంపు వున్నాయి. తీరిక సమయంలో నీళ్ళు తెచ్చి మొక్కలకు పోసుకున్నారు. చెట్లు వాడకుండా నీళ్ళు పోసి కాయగూర మొక్కలను కాపాడుకోవడంతో మొక్కలు బాగా కాస్తున్నాయి. కూరగాయలకోసం ఆ కుటుంబానికి కనిష్టంగా నెలకు రూ.100/- నుండి 150/- వరకూ ఖర్చయ్యేది. ఇపుడు ఆ ఖర్చులు మిగలడమేకాక, స్వంతముగా కూరగాయలు పండిస్తున్నందున, కొనుగోలు చేసినప్పటికంటే ఎక్కువగా కూరగాయలు తినగలుగుతున్నారు. అంతేకాదు. చుట్టు ప్రక్కల కుటుంబాలవారికి కూడా అదనంగా వున్న కూరగాయలను ఉచితంగా ఇస్తున్నారు. దీనిద్వారా చుట్టుపక్కల కుటుంబాలవారితో వారికి మంచి సంబంధాలు ఏర్పడినాయి. వారు అభిమానంగా మాట్లాడుతుంటే, గర్వంగా వుంటుందంటున్నారు. ఓబుళమ్మ దంపతులు, అంతేకాకుండా వారు ఇంటి దగ్గర లేనప్పుడు పశువులు వచ్చి మొక్కల్ని పాడు చెయ్యకుండా కూడా ఇరుగు, పొరుగు వారు జాగ్రత్త చేస్తున్నారు. ఈ కుటుంబాన్ని చూసి ఇతరులు కూడా పెరటి తోటల్ని పెంచుకుంటున్నారు. దీనికోసం వీరికైన పెట్టుబడి రూ.20/- మాత్రమే. ఇదే సంవత్సరానికి రూ.1200/- నుండి 1800/- వరకూ ఖర్చును మిగిలించడమేగాకుండా చుట్టుపక్కలవారితో మంచి సంబంధాలను నెలకొల్పుతోంది. సహాయం చిన్నదైనా చాలా మంచి సహాయమే చేసినారని ఎకాలజీ సెంటరు సిబ్బందిని అభినందిస్తున్నారు ఓబుళమ్మ దంపతులు.

## సంస్థ సహాయంతో చేపల వేటతో ఉపాధిని పెంచుకున్న ఉదిరిపికొండ తాండా వాసులు

కూడేరు మండలం ఉదిరిపికొండ తాండాకు సంబంధించిన 30 యస్.టి. కుటుంబాలకు దగ్గరలోని పెనకచెర్ల డ్యామ్‌లో చేపలు పట్టుకోవడానికి ప్రభుత్వం లైసెన్సును మంజూరు చేసింది. ఈ లైసెన్సుకు గాను ప్రతి కుటుంబమూ సంవత్సరానికి ఒకసారి రూ.1000/- చొప్పున ప్రభుత్వానికి గుత్త చెల్లించాలి. చేప పిల్లల్ని ప్రభుత్వం వారే వదులుతారు. 3-4 నెలల తరువాత ఈ పిల్లలు సైజుకు వస్తాయి. అప్పటి నుండి వీటిని పట్టుకోవడానికి అనువుగా వుంటుంది. అయితే చేపల వేటకుగాను ప్రతి కుటుంబము తెప్ప, వలల్ని సిద్ధం చేసుకోవాడానికి దాదాపు 10-15 వేలు దాకా ఖర్చవుతుంది. అంతకు ముందు వ్యవసాయంలో పెట్టుబడుల చేత ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ ఖర్చును భరించలేని పరిస్థితుల్లో 7 కుటుంబాలున్నాయి. ఎకాలజీ సెంటరు సిబ్బంది వీరి సాధక బాధల్ని గమనించి ఈ 7 కుటుంబాల వారికి కలిపి 70 వేలు సహాయం చెయ్యడం జరిగింది. ఆ ఏడు కుటుంబాలలో లక్ష్మీనరసమ్మ, హరిదాసు కుటుంబం ఒకటి.

లక్ష్మీనరసమ్మ, హరిదాసు కుటుంబ సభ్యులు మొత్తం అయిదు మంది ఉన్నారు. వారికి అయిదు ఎకరాల పొలం వుంది. వ్యవసాయం పూర్తిగా వర్షాధారమే. వర్షాలు సరిగావస్తే, వేరుశెనగ, కంది పండిస్తారు. నమ్మకంలేని వ్యవసాయంతో జీవనాధారం దొరుకుతున్నది చేపలవేట ద్వారానే. పంటపెట్టిన తరువాత 4-5 నెలలు వ్యవసాయ పనుల్లో వుంటారు. ఆ తరువాత చేపల వేట మీద దృష్టిమరల్చుతారు. ఆర్థికంగా ఈ కుటుంబానికి ఉన్న అవకాశాలన్నీ వ్యవసాయంమీద హరించుకుపోవడంతో, చేపల వేటకు వలలు, తెప్పలు లేక నిస్సహాయంగా నిలబడిపోయినారు. ఈ సందర్భంలో ఎ.ఎఫ్. ఎకాలజీ సిబ్బంది ఆర్థిక సహాయం చేయడంలో వలలు, తెప్పలు సమకూర్చుకున్నారు. చేపల వేటకు భార్యా, భర్త ఇరువురూ కలిసి వెళ్తారు. రోజుకు 10 నుండి 15 కేజీల వరకూ చేపలు పడతారు. 1 నుండి రెండు కేజీల రొయ్యలు కూడా దొరుకుతాయి. నెలలో 15 రోజులు మాత్రం చేపలు పడతారు. ఒక కేజీ చేపలకు 30 నుండి 40 రూపాయాల వరకూ ఆదాయం వస్తుంది. రొయ్యలకు 100/- నుండి 120/- వరకూ వస్తుంది. ఈ చేపలు గ్రామంలోనే అమ్ముడుబోతాయి. చుట్టు పక్కల గ్రామాల వారు, అనంతపురం పట్టణం నుండి వ్యాపారులు వచ్చి తీసుకుపోతారు. ఈ పద్ధతిన నెలకు 6 వేల నుండి 7 వేల వరకు నికరాదాయం వస్తున్నది. వారి కుటుంబ అవసరాలకు కూడా చేపలు దొరుకుతున్నాయి. వ్యవసాయంలో నష్టం వచ్చి జీవనాధారణ పోయినా, చేపలవేట ద్వారా సుఖంగా బతికే వనరు ఏర్పాటు చేసినందులకు ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటరును తలుచుకుంటున్నారు.

**ప్రచురణ:** డైరెక్టరు - ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in / actionf_atp@dataone.in